క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే తాటిపర్తి పర్యటన

పెద్దదోర్నాల: యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శనివారం మండల కేంద్రం పెద్దదోర్నాలలో పర్యటించనున్నట్లు ఎంపీపీ గుమ్మా పద్మజ తెలిపారు. శనివారం జరగనున్న మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొననున్నట్లు చెప్పారు. సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆమె కోరారు.

అదుపుతప్పిన లారీ.. తప్పిన ప్రమాదం

తాళ్లూరు: చీమకుర్తి నుంచి తూర్పుగంగవరం వైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి కాలవలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన మండలంలోని గుంటి గంగమ్మ తల్లి దేవాలయం సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పశువుల దాణా లోడు లారీ ప్రమాదానికి గురైంది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

తిరునాళ్లలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


ఎస్‌ఐ సంపత్‌కుమార్

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న తిరునాళ్ల వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సంపత్‌కుమార్ సూచించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన రాచకొండలో బంగారమ్మ తిరునాళ్ల, 16వ తేదీన ముటుకుల గ్రామంలో సంతాన వేణుగోపాల స్వామి తిరునాళ్ల సందర్భంగా ప్రజలు ఆనందోత్సాహాలతో తిరునాళ్ల జరుపుకోవాలన్నారు. తిరునాళ్ల సందర్భంగా ఎలాంటి గొడవలు సృష్టించినా, అశ్లీల నృత్యాలు చేసినా, ప్రజలను ఇబ్బందులు పెట్టినా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ఆయన హెచ్చరించారు. అన్ని వర్గాల ప్రజలు అన్నదమ్ముల్లా తిరునాళ్లను పండగలా చేసుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల ప్రజలు పోలీసులకు పూర్తిగా సహకరించాలని ఎస్‌ఐ సంపత్‌కుమార్ కోరారు.

బోడపాడులో చలివేంద్రం ఏర్పాటు

మార్కాపురం టౌన్: మార్కాపురం నుంచి మల్లంపేట వెళ్లే మార్గంలో బోడపాడు వద్ద శ్రీ కృష్ణ సేవా సమితి వ్యవస్థాపకుడు అడగా రాజగోపాల్ శుక్రవారం మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతం మీదుగా రోజూ ప్రయాణికులు, గ్రామస్తులు, కూలీలు రాకపోకలు సాగిస్తుంటారని, మధ్యాహ్న సమయంలో తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వేసవి పూర్తయ్యే వరకు చలివేంద్రాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జి.రాజగోపాల్, టి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి జన్మనక్షత్ర పూజలు

మార్కాపురం: అయ్యప్పస్వామి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని స్వామివారి ఆలయంలో అర్చకుడు రాఘవ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ దంపతులు స్వామివారికి పూలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జి.మల్లికార్జునరావు, కార్యదర్శి పి.కృష్ణయ్య, కోశాధికారి అన్నా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రహదారిపై మురుగు

కొమరోలు: మండలంలోని రాజుపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పొట్టిరెడ్డిపల్లె గ్రామంలో ఆర్‌అండ్‌బీ రహదారిపై మురుగు ప్రవహిస్తుండటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా సైడుకాలువలు ఏర్పాటు చేయకపోవడంతో గృహాల్లోని మురుగు రహదారిపైకి చేరుతోంది. ద్విచక్ర వాహనదారులు ఈ రహదారులపై వెళ్తూ జారి పడి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. పైగా మురుగు దోమలకు నిలయంగా మారి, రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ, ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

గిద్దలూరు రూరల్: 1998 డీఎస్సీ, ఎంటీఎస్ ఉపాధ్యాయులు తమను రెగ్యులర్ చేయాలని కోరారు. పట్టణంలోని నరవ రోడ్డులో గల సీతారామ కల్యాణ మండపంలో శుక్రవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో గిద్దలూరు జోన్ ప్రాంతీయ విద్యాసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తమ సమస్యలపై ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సభలో ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. పెండింగ్ డీఏలు, సరెండర్ లీవ్‌ల నగదు, మెడికల్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల, జిల్లా ఉపాధ్యక్షుడు టి.సుబ్బారాయుడు జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌బాబు, శ్రీధర్‌శర్మ, దేవప్రకాశం, ఎంటీఎస్ ఉపాధ్యాయుల సంఘ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు మార్తాల బాలిరెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు ఎంకే బేగ్, రఘువీర్, అబ్దుల్‌మజీద్, రమణారెడ్డి, కేశవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


చట్లమిట్ల వెళ్లే రోడ్డు ఇలా..


ఏనుగులదిన్నెపాడు వద్ద గోతులతో ఉన్న రోడ్డు

అధ్వానంగా గ్రామీణ రహదారులు

- అడుగుకో గోతితో అవస్థలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు


తోకపల్లి సమీపంలో ఛిద్రమైన రోడ్డు

పెద్దారవీడు:

మండలంలో పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు గోతులతో అధ్వానంగా మారాయి. రహదారులు పూర్తిగా ఛిద్రమై ప్రయణానికి ఇబ్బందికరంగా ఉన్నాయి. పెద్ద పెద్ద గోతులు, గుంతలతో ఉన్న రోడ్లపై వెళ్లేందుకు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆయా మార్గాల్లో ప్రయాణించేందుకు వాహనదారులు అష్టకష్టాలు పడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణించాలంటే గుంతలు కనిపించక పోవడంతో అరచేతిలో ప్రాణం పెట్టుకొని వెళ్లాల్సి వస్తోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గోతులమయంగా ఉన్న రహదారుల్లో ప్రయాణిస్తున్న వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఆయా తారు రోడ్లపై నిత్యం ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. గోతుల్లో పడి తరుచూ తమ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని ఆటోలు, ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. రహదారులకు మరమ్మతులు చేయాలని సంబంధించిన అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రాజంపల్లి నుంచి తోకపల్లి, ఏనుగులదిన్నెపాడు నుంచి తోకపల్లి, ప్రగళ్లపాడు నుంచి చట్లమిట్ల అడ్డ రోడ్డు గ్రామాలకు వెళ్లే రహదారులు గోతులు పడి ఛిద్రమయ్యాయి. ఏనుగులదిన్నెపాడు గ్రామం నుంచి తోకపల్లి వరకు రోడ్డు మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు కనిపించడం లేదు. మూలమలుపుల వద్ద చిల్లకంప ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తారు రోడ్లకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయడంతో పాటు చిల్లకంపను తొలగించాలని, మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బాధ్యత లేని అధికారులు అవసరం లేదు

- కురిచేడు సర్వసభ్య సమావేశంలో నేతల ఆగ్రహం



జెడ్పీటీసీతో వాగ్వాదానికి దిగిన ఏఈ హనుమాన్‌బాబు

కురిచేడు: బాధ్యత లేకుండా, ప్రజాసేవలో పాలుపంచుకోకుండా ప్రవర్తించే అధికారులు మండలానికి అవసరం లేదని, వారి స్థానంలో వేరే అధికారులను నియమించాలని తీర్మానం చేయండి.. అంటూ జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో శుక్రవారం ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సభ్యుడు ఆవుల వెంకటరెడ్డి మాట్లాడుతూ జేజేఎం పనులు దాదాపుగా పూర్తి చేశానని, ఎంబుక్ రికార్డు చేసి బిల్లు ఇస్తే వెంటనే కుళాయిలు ఏర్పాటు చేసి ఈ వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చేస్తానని చెప్పారు. సమావేశానికి ఆలస్యంగా వచ్చిన ఏఈ హనుమాన్‌బాబు మాట్లాడుతూ ఎంబుక్ తాను రికార్డు చేయనని, డీఈ వద్దకు వెళ్లి చేయించుకోండని చెప్పడం ఆయన పనితీరుకు అద్దం పడుతోంది. మంజూరైన పనులు ఎప్పుడు చేయిస్తారని, ఇంతవరకు ఎందుకు చేయించలేదని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి అడిగిన ప్రశ్నలకు జేఈ హనుమాన్‌బాబు స్పందించి మీకు కేటాయించిన రెండు పనులు ఎందుకు చేయలేదని ఎదురు ప్రశ్నించటం సభను ఆశ్చర్యానికి గురిచేసింది. అనంతరం ఏఈఈ సభ మధ్యలో వెళ్లిపోవడం ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా నిలిచింది. మండలంలో ఎందరో ప్రజాప్రతినిధులు ఏఈ ప్రవర్తనతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలకు క్షేత్ర స్థాయిలో సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులకు ఉంటుందని, అధికారులు ప్రజాప్రతినిధులకు సహకరించి సమష్టిగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలా సహకరించేందుకు ఇబ్బందిగా ఉన్న అధికారులు వారికి ఇష్టమొచ్చినచోటుకు వెళ్లిపోవాలని ప్రజాప్రతినిధులు సూచించారు. ఆదరణ-3లో తక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారని, అవసరమైనవారందరూ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సతీష్‌బాబు కోరారు. ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. ఈ శనివారం ప్లాస్టిక్ రహిత మండలంగా చేయాలని పిలుపునిచ్చారు. ఎక్కడా ప్లాస్టిక్ కవర్లు లేకుండా చూడాలన్నారు. ఇళ్లు నిర్మించుకుంటున్న పేదలకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం అందజేస్తోందని, బీసీలు, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు ఇస్తున్నట్లు హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మరియదాసు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వచ్చే పాలు, గుడ్లు, పిండి, వస్తువులు కార్యకర్తలు అమ్ముకుంటున్నారని, కేంద్రాల్లో పిల్లలు ఐదుగురు ఉంటే రికార్డులో 40 మంది ఉంటున్నారని సభ్యుడు ఆవుల వెంకటరెడ్డి ఐసీడీఎస్ సూపర్‌వైజరు చిలకా సుభాషిణిని ప్రశ్నించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా చేసిన పనులకు ఏళ్లు గడుస్తున్నా బిల్లులు రాలేదని ఏకరు వుపెట్టారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు అన్నెం అరుణ, షేక్ కాశింబీ, సర్పంచ్‌లు కాసు భాస్కర్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి రెహమాన్, వ్యవసాయాధికారి పి.మధుబాబు, ఏఈఓ వస్త్రాం నాయక్, ఎస్ఎస్‌పీ జేఈ భరత్, పశువైద్య అదనపు సంచాలకులు గంటా నాగేశ్వరరావు, ఏపీఎం సైమన్, నాయకులు ఆవుల వెంకటరెడ్డి, సాదం నాసరయ్య, ఆసుపల్లి చెన్నారెడ్డి, మస్తాన్‌వలి, బొరిగర్ల గోవిందు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కురిచేడును కప్పిన మంచు


మంచుతో కనిపించని రోడ్డు

- పగలు ఎండ..రాత్రి మంచు
- విచిత్ర వాతావరణంతో వాహనదారుల అగచాట్లు

కురిచేడు: ప్రకృతిలో వస్తున్న మార్పులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఉదయం పొగమంచుతో కురిచేడును మంచు కప్పేసింది. కనీసం పది అడుగుల దూరంలో ఉన్నవి కూడా కనిపించక పోవటంతో వాహనచోదకులు లైట్లు వేసుకుని చిన్నగా వెళ్లాల్సి వస్తోంది. రోడ్డున వెళ్లే పాదచారులు, వాకింగ్ చేసే వారు ఎదురుగా ఏం ఉందో కనిపించక ఇబ్బంది పడుతున్నారు. పగలు వేసవిని తలపిస్తూ 40 డిగ్రీల వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. మధ్యాహ్నం 12 గంటలు దాటిన తర్వాత రోడ్లపై చూద్దామన్నా జనం కనిపించడం లేదు. అలాగని రాత్రిళ్లు చూస్తే కన్ను పొడుచుకున్నా కనిపించనంత పొగమంచు పడుతూ వాహనచోదకులు అగచాట్లు పడుతున్నారు. విభిన్న వాతావరణం ఒకేసారి కనిపిస్తుండటంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ముఖ్యంగా రైతులు, కూలీలు ఉదయాన్నే పొగమంచులో పనికి వెళ్లి తడిచి ముద్దవుతున్నారు. పగలు ఎండలో వేడికి తట్టుకోలేక ఆస్పత్రుల పాలవుతున్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం

కొమరోలు: మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు శనివారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి-2 బొర్రా వెంకటరత్నం తెలిపారు. శనివారం నుంచి ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రభుత్వం అందించిన సమయం ప్రకారం క్లాసులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లోనూ ప్రభుత్వ ఉత్తర్వులు తప్పనిసరిగా పాటించి ఒంటిపూట బడులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మార్కాపురం టౌన్: మార్కాపురం మార్కెట్ యార్డులో ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందులు, శనగల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఏడీఏ బాలాజీ నాయక్ మాట్లాడుతూ.. క్వింటా కందులకు రూ.7,550, శనగలకు రూ.5,650 మద్దతు ధర ప్రకటించినట్లు చెప్పారు. మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ, ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు, పీఏసీఎస్ రమాదేవి, కాశయ్య, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా ఇంజినీరింగ్ కళాశాలకు న్యాక్ బి-గ్రేడ్



కేక్ కట్ చేస్తున్న వెన్నా హనుమారెడ్డి

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని ఇందిరా ఇంజినీరింగ్ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్(న్యాక్) బి-గ్రేడ్ గుర్తింపు ఇచ్చినట్లు కళాశాల చైర్మన్, ఏపీ పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నేత వెన్నా హనుమారెడ్డి శుక్రవారం తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గత నెల 28 నుంచి మార్చి ఒకటో తేదీ వరకూ న్యాక్ బృందం కళాశాలలో పర్యటించి మౌలిక సదుపాయాలు, విద్యా విధానాలు తదితర అంశాలపై సంతృప్తి వ్యక్తం చేసి బి- గ్రేడ్ ప్రకటించిందని తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, తర్లుపాడు జెడ్పీటీసీ సభ్యురాలు వెన్నా ఇందిర, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎం రాఘవేంద్ర, వైస్ ప్రిన్సిపాల్ కె.రాజశేఖర్‌రెడ్డి, హెచ్ఓడీలు కె.సురేందర్ రెడ్డి, సీహెచ్ పుష్పలత, సత్యవాణి, ఎస్‌కే నసీమ, గంగరాజు, గోల్డ్ మేరీ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి


సరస్వతీదేవి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు

పెద్దదోర్నాల: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనసూయ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని మంచి మార్కులు సాధించాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ త్వరలో జరుగబోయే పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. పాఠశాలలోని చదువుల తల్లి విగ్రహానికి విద్యార్థులు పూలమాలలు వేసి ఆశీర్వాదాలు అందుకున్నారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఖాదర్‌వలి, ఉపాధ్యాయులు నాగమూర్తి, రామానాయక్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ


ఓ కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

త్రిపురాంతకం: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులను ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శుక్రవారం పరామర్శించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్రిపురాంతకానికి చెందిన చిలుకూరు భాస్కరరెడ్డి, రామసముద్రం గ్రామానికి చెందిన దేశిరెడ్డి కోటసుబ్బారెడ్డి, గతేడాది హైదరాబాద్‌లో గాయపడ్డ ప్రసాద్, గొల్లపల్లి గ్రామానికి చెందిన ఒంటేరు గురవయ్య మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను కలిసి ఆయన పరామర్శించారు. హోళీ పండగ సందర్భంగా గొల్లపల్లి, రామసముద్రం గ్రామాల్లో చిన్నారులతో ఎమ్మెల్యే సందడి చేశారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, మాజీ ఎంపీపీలు కోట్ల సుబ్బారెడ్డి, ఆళ్ల ఆంజనేయరెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, నాయకులు సరళకుమారి, రంగబాబు, వెంకట తిరుమలయ్య, బాలకోటిరెడ్డి, గోపాలరెడ్డి, గాలేయ్య, వెంకటేశ్వర్లు, ఏసేబు, గురువారెడ్డి, ఆర్ పిచ్చయ్య, మల్లికార్జున, కోటిరెడ్డి, ఉన్నారు.


చిన్నారులతో సందడి చేస్తూ..

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న అన్నా రాంబాబు, పక్కన నాయకులు

- వైఎస్సార్ సీపీ శ్రేణులకు అన్నా రాంబాబు దిశానిర్దేశం

మార్కాపురం: క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం సాయంత్రం మార్కాపురం పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో తర్లుపాడు మండల పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ.. తాను నిత్యం పార్టీ శ్రేణులకు, ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. గెలిచినా.. ఓడినా.. ప్రజల మధ్యే ఉంటానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్ 6 పథకాలను ఆశగా చూపి, మోసపూరిత హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చారన్నారు. అలాంటి మోసపూరిత హామీలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికీ ఇవ్వరని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో మార్కాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడే విధంగా ప్రతి కార్యకర్త సైనికుల్లాగా పనిచేయాలన్నారు. కార్యకర్తలు ఎవరూ నిరుత్సాహపడాల్సిన పనిలేదన్నారు. సమావేశంలో ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, రామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కంది ప్రమీలారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు గుమ్మా రాజేంద్రప్రసాద్, సొసైటీ మాజీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, చెన్నకేశవులు, బొర్రయ్య, రామిరెడ్డి, రమణారెడ్డి, వెంకటరెడ్డి, కాశయ్య, సర్పంచ్ పల్లెపోగు వరాలు, షాజహాన్, దాసయ్య, ఎంపీటీసీ అంకయ్య, మల్లారెడ్డి, రమేష్‌రెడ్డి, వెన్నా సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ ఆలయ తిరునాళ్ల


ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ అమ్మవారు

దొనకొండ: స్థానిక కనకదుర్గమ్మ తల్లి ఆలయ తిరునాళ్లను భక్తులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. మొక్కుబడి ఉన్న మహిళలు కుటుంబ సమేతంగా తిరునాళ్లకు విచ్చేసి పొంగళ్లు చేసి నైవేద్యం సమర్పించారు. విజయవాడ, గుంటూరు, వినుకొండ, మార్కాపురం, గిద్దలూరు ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి పూజలు చేశారు. తాతల కాలం నుంచి కనకదుర్గమ్మను వేడుకొన్న భక్తులు ఏ ప్రాంతంలో ఉన్ననూ తిరునాళ్లకు వచ్చి రెండు రోజుల పాటు పూజలు చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. దాతల సహకారంతో అమ్మవారి ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. తిరునాళ్ల సందర్భంగా రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ టి.త్యాగరాజు బందోబస్తు ఏర్పాటు చేశారు.


పొంగళ్లతో విచ్చేసిన భక్తులు